క్లుప్తంగా

అల్పాహార ప్యాకెట్ల పంపిణీ



నెల్లూరు(బారకాసు): క్రాంతి మహిళా మండలి ఆధ్వర్యంలో పడారుపల్లిలోని దివ్యాంగుల కాలనీలో ఉన్న ఆచార్య పీసీరెడ్డి సమాజ మందిరంలో దివ్యాంగులు, వృద్ధులు, పేదలకు అల్పాహార ప్యాకెట్లను శుక్రవారం పంపిణీ చేశారు. వీరిశెట్టి సుజాతమ్మ, బాలకృష్ణయ్య దంపతుల వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు సత్యనారాయణ,శైలజ దంపతులు అల్పాహారాన్ని వితరణ చేశారు. క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, వరలక్ష్మమ్మ, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



నెల్లూరు సిటీ: బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో హ్యాండ్స్ ఆఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు రమేష్ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి సాయం అందించిన రిత్విక్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు తమ్మినేని పాండు, సరళ, వెంకటేష్ పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి విరాళం

నెల్లూరు(దర్గామిట్ట): అమరావతి రాజధాని నిర్మాణానికి మర్రిపాడు రైతులు రూ. 1.07 లక్షల విరాళాన్ని ప్రకటించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని సంతపేటలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి నగదు విరాళాన్ని అందజేశారు. రాజధాని నిర్మాణానికి తమ వంతు సాయంగా పింఛన్ మొత్తాన్ని విరాళంగా అందించినట్లు వారు పేర్కొన్నారు.

పందులను తరలించకపోతే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పందులను దూరంగా తరలించాలని, లేకపోతే చర్యలు తప్పవని పందుల పెంపకందారులను కమిషనర్ రమణబాబు హెచ్చరించారు. నగర పంచాయతీ కార్యాలయంలో పందుల పెంపకందారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణంలో పందులు స్వైర్వవిహారం చేస్తున్నాయన్నారు. కళాశాలలు, పాఠశాలల్లోకి వెళ్తుండడంతో విద్యార్థులు భయపడుతున్నారన్నారు. వర్షాకాలంలో పందుల కారణంగా పారిశుధ్యం లోపించి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. రెండు వారాల్లోగా పందులను నగర పంచాయతీకి దూరంగా జనసంచారంలేని ప్రదేశాలను తరలించాలని సూచించారు.

గుండెపోటుతో పెయింటర్ మృతి

నెల్లూరు(క్రైమ్): గుండెపోటుతో పెయింటర్ మృతి చెందిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు...మూలాపేట అలంకార్‌సెంటర్‌కు చెందిన అప్పారావు(50), ధనలక్ష్మి దంపతులు. ఆయన పెయింట్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత కొంతకాలంగా అప్పారావు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ రాత్రి కేవీఆర్ పెట్రోల్ బంకు జంక్షన్ వద్ద నుంచి ఇంటికి వెళుతుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యారు. ఆయన్ని స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఈ మేరకు మృతుని భార్య దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



మనుబోలు: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ సూచించారు. మనుబోలులోని కోదండ రామపురం అరుంధతీయవాడ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మహిళలకు డయేరియాపై వైద్యాఆరోగ్య సిబ్బందితో కలిసి ఆమె అవగాహన కల్పించారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించడం ద్వారా డయేరియాను అరికట్టవచ్చని తెలిపారు. పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వేడిగా ఉన్న ఆహారం, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తీసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాజేశ్వరమ్మ, అంగన్‌వాడీలు మస్తానమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా నిలవాలి

• ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

నెల్లూరు(వేదాయపాళెం): పని ప్రదేశాల్లో మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా, వారికి సురక్షితమైన వాతావరణం కల్పించే దిశగా మహిళా శిశు సంరక్షణ అధికారులు కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ సూచించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్ మహిళల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వెబెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దర్గామిట్టలోని ఐసీడీఎస్ కార్యాలయం నుంచి మహిళా అధికారులు హాజరయ్యారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ మాట్లాడుతూ మహిళల సంరక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఓఎస్‌హెచ్ యాక్ట్–2013పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల్లో పది మంది మహిళలు పనిచేసే చోట ముగ్గురితో ఇంటర్నల్ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. అందులో ఒకరు ఎన్‌జీవో సంస్థ నుంచి ఉండాలన్నారు. మహిళలపై వేధింపులు జరిగినట్లుగా కమిటీ సిఫార్సు చేస్తే 509 సెక్షన్ కింద సమస్యలను మూడు నెలల్లోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కమిటీ వద్ద న్యాయం జరగకపోతే జిల్లా స్థాయిలోని లోకల్ కంప్లైంట్ కమిటీ(ఎల్‌సీసీ)కి ఫిర్యాదు చేసుకుని న్యాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన నూతన కలెక్టర్



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఏ ఆనంద్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయం మంత్రి నారాయణను చింతారెడ్డిపాళెంలోని నివాసంలో కలిసి పూలమొక్క అందజేశారు. అనంతరం సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనంను కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్‌తో మంత్రులు పలు విషయాలపై చర్చించారు. జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై సూచనలు చేశారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోవూరు నియోజకవర్గ అభివృద్ధిపై ఇరువురు చర్చించారు.

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

నూతన కలెక్టర్ ఆనంద్‌ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రధాన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, కావలి మండలాధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జరుగుమల్లి జయకుమార్, మండల ఉపాధ్యక్షులు నటుకుల కిషోర్‌కుమార్, గుర్రం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

30 మంది యువత రక్తదానం



రక్తదానం చేస్తున్న యువత

నెల్లూరు సిటీ: పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని నోవా బ్లడ్ బ్యాంక్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నువ్వూరు అశోక్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 30 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ వ్యవస్థాపకుడు కోగిలి రమేష్‌రాజ్ మాట్లాడుతూ నిరుపేదలకు ఆపన్నహస్తం అందించేందుకు తమ సేవా సొసైటీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా సొసైటీ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో యువతకు ఆదర్శంగా నిలిచేందుకు నువ్వూరు అశోక్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. సమాజ సేవలో యువత పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. నోవా బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి మోపూరు రిషిత, మునివెంకటసూర్య, సభ్యులు యశు, రాజా, సాయితేజ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు రత్నం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న రత్నం యాజమాన్యం

నెల్లూరు (టౌన్): రత్నం మెడికల్ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో అండర్–13 బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థిని కే జనని, ఇండియన్ బౌ విభాగంలో ఏడో తరగతి విద్యార్థిని కే మోక్ష విజయం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. శుక్రవారం రత్నం స్కూల్‌లో జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. జాతీయ పోటీల్లోనూ రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జూనియర్ మేనేజర్ అజేయ్‌సింగ్, ప్రిన్సిపల్ మణిమాల పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న వక్తలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మత్తు పదార్థాలతో జీవితాలు నాశమవుతాయని, వాటికి యువత దూరంగా ఉండాలని పలువురు వక్తలు సూచించారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని కేఏసీ కళాశాలలో 'డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం..యువత బంగారు భవితకు బాటలు వేద్దాం' అనే అంశంపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల తలెత్తే దుష్పరిణామాలు, అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ప్రముఖ న్యాయవాది సుబ్బమ్మ, రామచంద్రారెడ్డి వైద్యశాల వైద్యులు దత్తాత్రేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హర్ష, అధ్యక్షుడు నరేంద్ర, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, నగర ఐద్వా కార్యదర్శి పద్మ, కేఏసీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్డును అద్భుతంగా తీర్చిదిద్దుతాం



ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డు ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి నారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని స్వర్ణాల చెరువు, ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డును అద్భుతంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. స్వర్ణాల చెరువు, నెక్లెస్‌రోడ్డును అధికారులతో కలిసి మంత్రి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డు, పక్కనే ఎంతో పవిత్రమైన నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని తమ హయాంలో రూ.24 కోట్లతో అభివృద్ధి చేశామని, ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. డీకేడబ్ల్యూ కళాశాల వెనుక వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుకు ఎకరా స్థలాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 2014లో ప్రారంభించిన పనులను త్వరలోనే పూర్తిచేస్తామని, ఇందుకు సంబంధించి ప్రణాళికలను వెంటనే తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

వీధి కుక్కలకు యాంటీరేబీస్ వ్యాక్సిన్లు



నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, ఎంహెచ్ఓ వెంకటరమణ ఆదేశాల మేరకు పశువైద్యాధికారి మదన్‌మోహన్ పర్యవేక్షణలో నగరంలోని అన్ని డివిజన్లలో వీధి కుక్కలకు శుక్రవారం రెండో విడత యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు వేశారు. వీధి కుక్కల నియంత్రణకు నిరంతరం వాటికి సంతానోత్పత్తి కలుగకుండా శస్త్రచికిత్సల ప్రక్రియ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కుక్కల బెడద అధికంగా ఉన్న ప్రాంతాల ప్రజలు స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేస్తే నియంత్రణ చర్యలు తీసుకుంటామని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని కోరారు.

• నగరంలోని ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సుజాతమ్మకాలనీ, కలెక్టర్‌బంగ్లా, ఎన్ఎంసీ, నీలగిరి సంఘం 11 కేవీ ఫీడర్ల పరిధిలోని సుజాతమ్మకాలనీ, జేవీఆర్ కాలనీ, ఆదర్శ్‌నగర్, జహీర్‌నగర్, బారాషహీద్ దర్గా, లక్ష్మీనరసింహాపురం, పరిసర ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

• వైఎంసీఏ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సండేమార్కెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ట్రంకురోడ్డు, లస్సీసెంటర్, పొగతోట, బృందావనం, సండే మార్కెట్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

గనీబాషా మృతి బాధాకరం

నెల్లూరు(అర్బన్): ఇస్కపాళెం పీహెచ్‌సీలో హెల్త్‌ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న షేక్ గనీబాషా అనారోగ్యంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లో గనీబాషా భౌతిక కాయం వద్ద హంస యూనియన్ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ జీజీహెచ్‌తో పాటు పలు పీహెచ్‌సీల్లో గనీబాషా పని చేశారని, ప్రతిచోట మంచిపేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు యూనియన్ తరుపున ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నారాయణరాజు, మజరుల్లా, సుధాకర్‌రెడ్డి, గౌస్‌బాషా, తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి



సభ్యత్వ నమోదు చేపడుతున్న ఎస్టీయూ నాయకులు

నెల్లూరు (టౌన్): నగరంలోని మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజమనోహర్ కోరారు. నగరంలోని మున్సిపల్ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 16 ఉన్నత, 10 ప్రాథమికోన్నత, 40 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఆయా పాఠశాలల పరిధిలో దాదాపు 170 మంది ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. పాఠశాలలు ప్రారంభించి నెలరోజులు కావస్తున్నందున త్వరగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. జీఓ 117ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నగరాధ్యక్షుడు నారాయణరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సుమన్, నాయకులు వెంకటసుబ్బయ్య, వెంకటరత్నం, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



వసతి గృహాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ యామిని ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి ఆధ్వర్యంలో పొదలకూరు రోడ్డులోని విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వాణి మాట్లాడుతూ పిల్లల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన 1098 సేవలు, బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. తొలుత వసతి గృహంలోని వసతులు, భోజనం ఏర్పాట్లను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని పిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్ కస్తూరి, తదితరులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన సహకార ఉద్యోగుల సంఘ నాయకులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్‌ను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో జరిగిన పాలకవర్గ సమావేశానికి పర్సన్ ఇన్‌చార్జిగా హాజరైన జేసీకి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుష్మారెడ్డి, తేజశ్విని, కృష్ణ, సాజిదా, మానస, కోటేశ్వరరావు, రమేష్, ఖలీల్, గౌస్‌బాషా, తదితరులు, పాల్గొన్నారు.

డీసీసీబీ సిబ్బందికి శిక్షణ



ఆన్‌లైన్ ద్వారా డీసీసీబీ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న డీసీఓ గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా సహకార బ్యాంకు సిబ్బందికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా సహకార శాఖ అధికారి(డీసీఓ) గుర్రప్ప రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించి శిక్షణ ఇచ్చారు. నగరంలోని తన కార్యాలయం నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పర్యవేక్షణను ఏ విధంగా నిర్వహించాలి అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. సభ్యత్వ నమోదు, రుణాల మంజూరు, వసూళ్లు, పాలకవర్గ మహాజనసభ సమావేశాలు, పుస్తక నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మూలాపేటలోని విద్యార్థి అకాడమీ భవనంలో నిర్వహిస్తున్న కామన్ సర్వీసు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలోని పీఏసీఎస్‌ల ద్వారా 300 రకాల ఆన్‌లైన్ సేవలు అందించేందుకు సభ్యులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామన్ సర్వీసు కేంద్రాల జిల్లా మేనేజర్ కళ్యాణ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన



భోజనాన్ని రుచి చూస్తున్న ఏపీసీ ఉషారాణి

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ ఉన్నత పాఠశాలను సర్వశిక్ష అభియాన్ ఏపీసీ ఉషారాణి శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు చిక్కీలు అందకపోవడంపై ఆరా తీశారు. చిక్కీలను ఇంకా సరఫరా చేయలేదని భోజన ఏజెన్సీ నిర్వాహకులు వెల్లడించారు. ఏపీసీ వెంట హెచ్ఎం సునంద తదితరులు ఉన్నారు.

బడిఈడు పిల్లందరూ బడిలో ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇందుకూరుపేట: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంఈఓ–2 సునీల్‌కుమార్ తెలిపారు. నేడు బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 సునీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుందని, చిన్నారులను బడిలో చేర్పించి చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తజన తీరం

విడవలూరు మండలం రామతీర్థంలో కొలువైన కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన తీర్థవాది (సముద్ర స్నానం)కు శుక్రవారం భక్తజనం పోటెత్తారు. రాముడు నడియాడిన తీరంగా ప్రసిద్ధి చెందిన రామతీర్థం తీరంలో సముద్ర స్నానాలు ఆచరిస్తే సర్వపాపాలు తొలగిపోతాయనే నమ్మకంతో భక్తులు భారీగా తరలివచ్చారు. అమావాస్య కావడంతో సముద్రంలో అలల తాకిడి ఎక్కువగా ఉంది. అయినప్పటికీ లెక్కచేయకుండా భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. సైకత శివలింగాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని నందీశ్వరుడు, రామలింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత సంప్రదాయంగా కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరుని ఊరేగింపుగా సముద్ర తీరానికి తీసుకెళ్లి వసంతోత్సవం, తీర్థవాది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తంబి సిద్దయ్య జ్ఞాపకార్థంగా ఆయన భార్య సుబ్బమ్మ వ్యవహరించారు. కాగా తీర్థవాది సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తీరంలో పోలీసులు, మెరైన్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

–విడవలూరు

